

చర్చి కాంపౌండు చెట్టు నీడన 'పిచ్చితల్లి' పండంటి మగబిడ్డను ప్రసవించింది. ఆరోజు ఆదివారం. చుట్టూ మూగిన అమ్మలక్క లంతా ప్రేయర్ విషయం విస్మరించి, నోరు నొక్కుకుంటూ పిచ్చితల్లిని గూర్చే మాట్లాడుకొం టున్నారు. "పాపం! సరిగ్గా ఈవూరొచ్చి సంవ త్సరమైంది. ఒకరితో పలుకదు, మాట్లాడదు.

# పిచ్చితల్లి

**కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి**

పిచ్చిపిచ్చిగా బెదురు చూపుల్తో... "నా మోహన్ రాడంటారా? తప్పకవస్తాడు. ఎక్కడున్నాడో ఏమో?... నాన్నా! నన్ను కొట్టొద్దు. నేనే పాపమూ ఎరుగను... అమ్మా నీవైనా చెప్పవే!... ఎప్పుడో ఓ రోజు నా మోహన్‌వచ్చి మిమ్మల్నందర్నీ తంతాడుగా! అప్పుడు నేను నవ్వుకుంటాగా"... అంతలోనే వెకిలి నవ్వు. ఊరిజనమంతా వింతగా చూచేటోళ్లు. "ఎవరో పెద్దింటి బిడ్డే మతి స్థిమితిం కోల్పోయినట్టుంది. ఏ ఊరి నుంచి వచ్చిందో ఏమో!" సానుభూతి మాటలు కొందరివి.

"ఏదో లవ్ ఫెయిల్ కేసులాగుంది. మానసికంగా బాగా దెబ్బతింది" కుర్రకారు ఉవాచ.

"వేళకు యిండ్ల ముందు నిలబడుతుందే గానీ అన్నం అడుగదు. పదినిమిషాలుచూసి ప్రక్కింటికి వెళ్లేది" నిత్యం పిచ్చి తల్లిని పరిశీలించి చూసిన అమ్మలక్కల కామెంటు.

చెట్టు నీడన మట్టిలో చంటిబిడ్డ కేర్‌కేర్ మని ఏడుస్తూంటే... కాళ్లు ముడుచుకొని, కళ్ళు మూసుకొని తనకేమీ తెలియదన్నట్టు పిచ్చితల్లి.



"బిడ్డకు బొడ్డన్నా కోయండి. పుట్టినబిడ్డ పుట్టినట్టు పేగు తెంచుకోకుండానే ఏడుస్తున్నాడు". ప్రస్తుతకర్తవ్యాన్ని ఏకరువు పెట్టింది వయసు మళ్లిన మరియమ్మ.

ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తున్న 'శారి' ప్రక్కనే ఉన్న కొడుకును పంపి, బైట బంకులో బ్లేడ్ తెప్పించి బొడ్డు కోసింది. హాండ్‌బ్యాగ్‌లో 'నేప్‌కిన్' తీసి బిడ్డ క్రింద వేసింది. తల్లిని తట్టిలేపి టీ తాగించింది. వెర్రిచూపులు చూస్తూ పిచ్చితల్లి

కడుపు వత్తుకొంటూ ఏడుస్తోంది.

ఆడవాళ్లంతా చుట్టూ దడికట్టినట్టు నిలబడ్డారు. "మాయవస్తున్నట్లుంది. పిచ్చితల్లి ఏమి చెప్పగలదు" కాన్పులు చేయడంలో అనుభవమున్న శౌరి అంటోంది.

* * *

ఇంతకాలం ఊరనక పెల్ల అనక తిరిగింది. ఎవరు ఓ ముద్దపెట్టినా తిని నీళ్ళు తాగింది. ఈఊరికి వచ్చేటప్పటికి ఆమె గర్భవతి కాదు. ఓ సారి ఈ ఊరొచ్చిన కొత్తలో కట్టుకొన్న లంగా ముట్టు మరకల్తో తడిచి ఉంటే కరణంగారి కాంతమ్మే తన కూతురు లంగా వోణి ఇచ్చింది" ఎరిగిన విషయం ఏకరువు బెట్టింది కరుణమ్మ.

'అందరం తలోమాట అంటూ కాలం వెళ్లబుచ్చితే ఈ తల్లీబిడ్డల విషయం పట్టించుకొనేదెవరు? అందరం పాస్టర్ దగ్గరకెళ్లి మాట్లాడి తల్లి బాగా కోలుకునేదాకా మిషన్ ఆసుపత్రిలో చేరుద్దాం. అందరం చందాలు వేసుకొని కావలసిన వసతి ఏర్పాటు చేద్దాం. ఆడజన్మ గతి యింతేకదా! కడుపు చేసినోడు చేసి వెళ్లాడు! ఆరంభారం పిచ్చిదైనా మంచిదైనా మోయాల్సింది తల్లేకదా?" వేదాంతాన్ని కలబోస్తూ కర్తవ్యాన్ని అందరి ముందుంచింది మరియమ్మ.

బలహీనంగా ఉన్న పిచ్చితల్లిని, బిడ్డను నలుగురూ కలిసి మిషన్ ఆసుపత్రిలో చేర్చారు.

* * *

ఆడవారికి ఆత్మీయతను పంచే అమ్మతనమే కాదు, అన్యాయాన్ని అరా తీసే ఆలోచనా నిపుణతా ఉంటుంది. తెగబడితే ఎంతటోళ్లనైనా ఎదిరించే నైజమూ ఉంటుంది.

'పిచ్చితల్లి' పగలు ఊరూ, పాలెం అంతా తిరిగేది. కాని రాత్రులు ఊర్లో రామాలయం వసారాలో పడుకొనేది. పొద్దుపోయిందాకా తనలోతాను పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడుకొనేది. ఏడ్చేది, నవ్వేది. తల్లిదండ్రులు దండిస్తున్నట్లు భయంభయంగా లేచి కూర్చునేది. గాలిలో చేతులు ఊపుతూ "నన్ను కొట్టకండి! నన్ను చంపకండి! నా మోహన్ తప్పక వస్తాడు... మీ అందర్నీ కొడతాడుగా..." అంటూ ఆవేశం కుదుటపడగానే పడుకుని ఏ జామునో నిద్రోయేది!

ఆమె పేరూ తెలియదు, ఊరు తెలియదు. కులమూ తెలియదు. అందరూ ఆమెను 'పిచ్చితల్లి' అని పిలిచేవాళ్లు. సానుభూతితో ఒంటిమీద బట్టలు చినిగిపోయినా ఊడిపోయినా పాతబట్టలు ఎవరో ఓ తల్లి కట్టేది. మతిస్థిమితం లేకపోయినా పిచ్చితల్లి ఎర్రని శరీరచ్ఛాయతో, కోటేరేసినట్లున్న ముక్కుతో, పెద్దపెద్ద కళ్ళతో, సంస్కరణ లేకపోయినా నల్లని పొడవాటి జుట్టుతో మట్టిలో మాణిక్యంలా ఉండేది. "ఏ తల్లి కన్నబిడ్డో ముఖాన ఈ రాత రాసాడు ఆ దేవుడు" అంటూ ఊరూ, పాలెం సానుభూతి చూపించేది. ఎవర్తో ఒకరు వేళకింత తిండి పెట్టేవారు. మాట్లాడడానికి ప్రయత్నిస్తే ఆడవారినైతే... "నీవూ అమ్మవేకదా నా బాధలేమన్నా ఆర్చేవా తీర్చేవా నేను పలకను పో..." అంటూ పరుగెత్తేది. మగవారినైతే... "నీవూ నాన్నవేకదూ... బిడ్డనే జాలిలేకుండా ఆ కర్రతో అలా మోదుతావా? నీకు మనసు లేదులే నాకెప్పుడో తెలిసింది. ఇక నీ దెబ్బలకు నేను తట్టుకోలేను. అందుకే పారిపోతున్నా"నంటూ పరుగెత్తేది.

అందుచేత ఊళ్లో, వాడలోగాని ఎవరికీ

అమెరికాలో ప్రతి 13 నిమిషాలకూ ఒక కొత్త పుస్తకం వెలువడుతుందట.




ఈమె విషయం తెలీదు. కానీ ఆమె వచ్చిన నాలుగైదు మాసాలకు కుడుపు ఎత్తుగా ఉండడం, మనిషి గుల్లబారడం చూసాక ఆడవాళ్లకు అనుమానం వచ్చింది. నలుగురు అమ్మలక్కలు ఒకచోట చేరినప్పుడు "పాపం పిచ్చితల్లి గర్భవతి. ఈపాపానికి ఒడిగట్టిన మారాజు ఎవడో? తప్పకుండా మనఊరి వాడే అయిఉంటాడు. అయినా ఈ పిచ్చిదాన్ని ఈ పని చేసినవాడు మనిషేనా? రోజులమ్మా రోజులు! కామం కళ్లు మూసే రోజులు. తల్లీపిల్లకూ తేడా తెలీనిరోజులు. ప్రేమకు, పిచ్చికీ విజ్ఞత తెలియని రోజులు" అనుకొనేవారు.

పిచ్చితల్లి విషయం ఊళ్లో ఆడవాళ్ళ మగవాళ్ళను ఓ ఆలోచనలో పడేసింది. ఊళ్లో ఆకతాయిలు వున్నారు. జూదగాళ్లు వున్నారు. తాగుబోతులూ వున్నారు. అయినా ఇటువంటి నీచమైన పనికి దిగజారినవాడెవడు? పెండ్లికాని కుర్రోళ్లు ఊరు విడచి పట్టణాల్లో చదువుకుంటుండిరి. పోతే ఈడొచ్చిన కుర్రోళ్లకు పెండ్లిండ్లాయె! ఇంకెవడు ఈ నీచానికి పాల్పడిఉంటాడు? రాత్రుళ్లు పడుకునేది పాలెంలో కూడా కాదు ఊళ్లో దేవాలయం పంచలోనే! ఈ ప్రశ్న అందర్నీ వేధిస్తూనేవుంది. సమాధానం దొరకడం లేదు. తప్పక ఊర్లోనే ఈ పని జరిగుంటుంది.

పండంటి మగబిడ్డ. సాకడం ఆ పిచ్చిదానికి ఏం తెలుసు? సరిగ్గా పాలివ్వడమే తెలీదు. బిడ్డ ఈప్రక్క వుంటే ఆప్రక్కకు తిరిగి పడుకొంటుంది. బిడ్డనెప్పుడు పైనబడి త్రొక్కి చంపుతుందోనన్న భయం చూచేవాళ్లను వేధిస్తూనే ఉంది. అందుకే డ్యూటీలో ఉండే నర్సుకు పదేపదే పోయి చూచిన ఆడవాళ్ళంతా చెప్పి, ఖర్చులకు డబ్బులిచ్చి వస్తున్నారు.


పిల్లలులేని దంపతులను బిట్టను సాక్కోమని అడిగినా "పిచ్చిదాని బిడ్డ. బిడ్డా పిచ్చిదైతే ఎట్టాగ అనే అనుమానం వ్యక్తపరుస్తూ, ఎవరూ ముందుకు రావడం లేదు". అప్పటికే రెండు

మాసాలు గడిచింది. బలహీనం చేతనేమో పిచ్చి తల్లి వడి తగ్గింది.

* * *

బళ్లకు వేసవి సెలవులు ముగిశాయి. ఊళ్లో బడి తెరిచారు. కొత్త ట్రాన్స్‌ఫర్స్‌లో ఊళ్లో బడికి కొత్త టీచరు వచ్చాడు. యువకుడు, ఉత్సాహ వంతుడు. కౌన్సిలింగ్‌లో అందరూ పట్టణాలకు వెడుతూంటే ఈయన కావాలని పల్లెలోకి వచ్చాడు. వచ్చీ రాగానే ఊళ్లో ఓ గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. పెండ్లయినట్టు లేదు. వంట స్వయంపాకమే. ఎవరైనా ఊరి పెద్దలు ఎదు రైతే చిరునవ్వుతో సమాధానమిస్తాడు. అంతకు మించి పలకరిస్తేతప్ప మాట్లాడడు.

టైమ్‌కి బడితెరవడం, ఊళ్లో తిరిగి పిల్లలను బడికి పిలుచుకు రావడం, బడికి పిల్లలను పంపని తల్లిదండ్రులకు నచ్చచెప్పి బడి ఈడు పిల్లల్ని బడిలో చేర్చడం, పిల్లలతో ఎంతో స్నేహంగాను, చనువుగాను, ప్రేమగానూ మెసలడం గ్రామపెద్దలు గమనించారు. రాక రాక ఊరికి మంచి పంతులొచ్చాడు అంటూ సర్టిఫికేటిచ్చారు. ఆడమగ కావాలని పలకరించడానికి పనిపెట్టుకొని పంతులు దగ్గరకు




*విశాల సాహిత్య అకాడమీ, సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం - హైదరాబాద్ ఆధ్వర్యంలో డిసెంబర్ 4, 2006న వ్యక్తిత్వ వికాసానికి సంబంధించి బి.ఎస్. రాములు రచించిన పుస్తకాల ఆవిష్కరణ సభ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో జరిగింది. ఈ సభకు దేవులపల్లి అమర్ అధ్యక్షత వహించారు.*

*"జీవితం అంటే ఏమిటి?" అనే పుస్తకాన్ని డా॥ సి. నారాయణరెడ్డి, 'వ్యక్తిత్వ వికాసం-సామాజిక నాయకత్వం' అనే పుస్తకాన్ని గద్దర్ ఆవిష్కరించారు. ప్రతాపరెడ్డి, దుర్గం రవీందర్‌లు పుస్తక సమీక్ష చేసారు.*

వెళ్లినా... క్లుప్తంగా ఎంతవరకు మాట్లాడాలో అంతవరకే ఆచితూచి మాట్లాడేవాడు. తరువాత మౌనం వహించేవాడు. విధిలేక వారు "వస్తాం పంతులూ" అంటూ వెళ్లేవారు.

ఊళ్లో మహిళామండలి సభ్యులంతా కలిసి 'పిచ్చితల్లి'కి, ఆమె బిడ్డకూ ఏదో ఓ దారి చూపించాలని ఆమె పోషణకు కొంత డబ్బు వసూలు చేసి, ఆసుపత్రి యాజమాన్యంద్వారా సాకాలని నిర్ణయం తీసుకున్నారు. దానికి పాస్టర్‌గారు తనవంతు సహాయం తానుచేస్తానన్నాడు. ఊళ్లో నలుగురు రైతులనూ చందాలు అడగమని సలహాయిచ్చాడు.

మహిళామండలి చందాలు వసూళ్లకు నడుముకట్టింది. ఆ ఇల్లు, ఈ ఇల్లు తిరుగుతూ పంతులగారి దగ్గరికెళ్ళారు. విషయాన్ని అంతా పంతులకు పూసగుచ్చినట్లు చెప్పారు. ఎందుకో పంతులుగారికి పిచ్చితల్లిని చూడాలనే కోరిక కలిగింది. "రేపు ఆసుపత్రికి వచ్చి మీరన్న పిచ్చితల్లిని, బిడ్డను చూచి నా చందా నేను ఇస్తాన"ని చెప్పి మహిళామండలి వారిని పంపించాడు పంతులుగారు.

ఉదయాన్నే బడి టైమ్ లోపు పంతులుగారు ఆసుపత్రి చేరుకొన్నాడు. నర్సు సహాయంతో పిచ్చితల్లి వుండేగదికి వెళ్ళాడు. పిచ్చితల్లి మాగన్నుగా నిద్రలో వుంది. ఏవేవో కలవరింతలు.

"నా మోహన్ వస్తాడు. నాన్నా! నన్ను కొట్టొద్దు నాన్నా, నేను ఏ తప్పుచేయలేదు నాన్నా" అంటోంది.

పిచ్చితల్లిని చూచిన మాష్టారు ఒక్కసారి అదిరిపడ్డాడు. తనకళ్లను తానే నమ్మలేకపోయాడు. ఒక్కసారి తనకూ ఆమెకూ ఉన్న పరిచయం సినిమారీలుగా మనస్సులో తిరిగింది. తాను కులం తక్కువవాడని ఆమె తల్లీదండ్రి దుర్భాషలాడి, వాళ్ళ ప్రేమని విడదీసి ఆమెను నానా హింసలు పెట్టిన కాలం కళ్ళముందు కదలాడింది.

ఒక్క ఉదుటన మంచం దగ్గరకెళ్లి "రాధా! రాధా!" అంటూ నిద్రలేపడానికి ప్రయత్నించాడు. ప్రక్కనే నిల్చున్న నర్సుకు ఈ సంఘటనంతా సినిమా స్టోరీలా అన్పించింది. ఆమె వెంటనే పరుగెత్తుకొంటూవెళ్లి విషయాన్ని డాక్టరుగారి చెవిలో వేసింది. ఆనోటా ఆనోటా పడి విషయం ఆసుపత్రికే కాకుండా ఊరంతా పాకింది. కొత్తగా వచ్చిన పంతులుగారే పిచ్చితల్లిని ప్రేమించిన ఆయనంటూ... పిచ్చితల్లి అడ్రస్ దొరికిందంటూ అంతా ఆసుపత్రికి వచ్చారు.

పిచ్చితల్లి గది చుట్టూమూగిన జనం పెద్ద కళ్లు చేసుకొని మాష్టారినే చూస్తున్నారు.

మాస్టారుగారి కుదుపులకు కళ్లు తెరిచిన పిచ్చితల్లి "ఎవరు నీవు? నీవూ నాన్నవేకదూ? నీకూ దయలేదు! నిర్దయగా తంతావు!" అంటూ పాతధోరణిలో మాట్లాడుతూ పరుగెత్తేందుకు ఒక్క ఉదుటన లేచి కూర్చుంది.

"నేను! రాధా నేను!... నీ మోహన్ని! సంవత్సరం నుంచి కళ్లల్లో వత్తులేసుకొని వెతుకుతుంటే ఇప్పుడు దొరికావు. మీ వాళ్లు నీకు పిచ్చిపట్టింది... ఎటో తప్పిపోయిందని ప్రచారం చేసారు. ఊళ్లోకెళ్లి విచారించగా నిజమేనని తెలిసింది. అప్పటినుంచి నేను పనిచేసే ఊళ్ళో మనుషుల్ని పెట్టి చుట్టూ గ్రామాల్లో వెతికించాను. అయినా ఫలితం లేదు" అంటూ రాధ తలను మోహన్ ఒడిలో పెట్టుకొన్నాడు. ప్రక్కనున్న పసిబిడ్డను తదేకంగాచూస్తూ ఈ బిడ్డ

ఈమె బిడ్డేనా? ఈమెకు ఈ బిడ్డ ఎలా కలిగాడు? మా మధ్య ప్రేమ చివురించి చెట్టు కట్టిందే గాని, వంశాంకురం కలిగేంత చనువెప్పుడూ తీసుకోలేదే! ఆశ్చర్యపోతూ చుట్టూ ఉన్న జనం కళ్లల్లోకి చూసాడు పంతులుగారు.

అక్కడే ఉన్న పాస్టర్‌గారు అందుకొని, "బాబూ! ఈఊరికి ఈమె వచ్చేనాటికి గర్భవతి కాదు. ఈమెకు మతిస్థిమితం లేదు. అందరూ 'పిచ్చితల్లి' అని పిల్చేవారు. ఈ ఊళ్లోనే ఈ పాపం జరిగింది. ఎవడు చేసిన అత్యాచారమో ఈమె గర్భానికి కారణమైంది. ఎవరు దీనికి కారకుడు అనేది ఎంత ఆరా తీసినా తేలలేదు" క్లుప్తంగా విషయం వివరించాడు పాస్టరుగారు.

"ఈమె మా తాతగారి ఊరి భుకామందు కూతురు. నా క్లాస్‌మేట్. మేం ప్రేమించుకుని పెండ్లి చేసుకొందాం అనుకొని పెద్దవారికి విషయం చెప్పాము. ఇరువైపులా ససేమిరా కాదన్నారు. ఈమె తండ్రి ఓ అడుగు ముందుకేసి వారి జీతగాళ్లతో నన్ను కొట్టించాడు. ఆ ఊరి పరిసరాలకు పోకుండా కట్టడిచేసాడు. మాది నిరుపేద కుటుంబం. బతకడానికి ఉద్యోగమే ఆధారం. నా తల్లిదండ్రులు నా మీదే ఆధారపడి బతకాలి. అందుకే నేను చేసేది లేక మా ఊరు వచ్చేసాను. తరువాత తెలిసింది వాళ్ల తల్లిదండ్రులు పెట్టే చిత్రహింసలకు తాళలేక ఈమెకు మతిచలించిందని, ఊళ్లో నుంచి ఎటో వెళ్లిపోయిందని. చుట్టుప్రక్కల గ్రామాల్లో వెతికాను. ఫలితం శూన్యం" అంటూ క్లుప్తంగా తమ కథ చెప్పాడు మోహన్.

రాధను హృదయానికి హత్తుకుంటూ కుల మతాల దురహంకారానికి కాలరాయబడ్డ కథ సార్! మాది. హృదయమున్న వాళ్లను పిచ్చోళ్లను చేసే సమాజం సార్ ఇది. నా రాధను నిర్దయగా పిచ్చిదాన్ని చేసారు సార్ అంటూ కన్నీరు మున్నీరైనాడు మోహన్.

"ఆవేశంతో దుఃఖించకు బాబూ! ఇది లోతుగా ఆలోచించాల్సిన సమయం" ఓదార్చుతూన్నారు పాస్టరు గారు.

"ఇప్పటికైనా ఆ భగవంతుడు కనికరించి నా రాధను నాకిచ్చాడు సార్! నేను వైద్యం చేయించి, నా ఇల్లాలిని చేసుకుంటాను. ఇక ఈ బిడ్డ అంటారా... మతిలేనప్పుడు జరిగిన యాక్సిడెంట్ ఫలమనుకుంటాను. స్వీకరిస్తాను. చందాల ద్వారా నా రాధను సాకవలసిన పని లేదు" అంటూ రాధ జుట్టు నిమురుతున్నాడు మోహన్.

కటిక చీకట్లో పోగొట్టుకొన్న వస్తువు ఏదో వెతుకుతున్నట్టు - నివ్వెరపోయి, మెహన్ కళ్లలోకి చూస్తూ కన్నీరు పెడుతోంది పిచ్చితల్లి. ఏదో జ్ఞాపకం... ఎప్పటిదో జ్ఞాపకం... రోజూ వెంటాడుతున్న జ్ఞాపకం తెరలు తెరలుగా మరుగున పడ్డ అరల్లోంచి బయటికొస్తోంది... ఆ పిచ్చిచూపుల్లో భయాన్ని పులుముకొన్న జ్ఞాపకం ఆమెను వణికిస్తోంది... ఏదో ఆత్మీయతా స్పర్శ ఓ ధైర్యాన్నిస్తూ... మోహన్ కళ్లల్లోకి చూస్తోంది ఆమె.

బిడ్డను చేతుల్లోకి తీసుకొని "ఇక నిన్ను 'యేసయ్య" అని పిలుస్తాం" అంటూ నామకరణం చేసారు పాస్టరుగారు. "ఆ కరుణామయుడు మనం పిచ్చితల్లి అనుకొనే రాధకు ఓ రక్షకుణ్ణి ప్రసాదించాడు" అంటూ దీవించాడు. అందరి కళ్లల్లో ఆనందం వెల్లి విరిసింది. పిచ్చితల్లి కళ్లు మెరిసిపోతున్నాయి. ●

ఒంటే కంటే ఎలుక ఎక్కువ రోజులు
నీళ్ళు లేకుండా బ్రతుక గలదు.